క్లుప్తంగా

మాజీ కేంద్ర మంత్రికి నివాళులు



సిరికొండ : మాజీ కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్ పి శివశంకర్ 96వ జయంతిని మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రూరల్ అధ్యక్షుడు బండారి నరేశ్, మండల అధ్యక్షుడు గ్యామ శోభన్, మహిపాల్, దిగంబర్, రవినాయక్, వినోద్, నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సిరికొండ : మండలంలోని రావుట్ల గ్రామంలో ఇటీవల చెరువులో పడి మృతి చెందిన జాగర్ల నరహరి కుటుంబానికి అతడి మిత్రులు ఆర్థిక సాయం అందజేశారు. నిజాంసాగర్ నవోదయ విద్యాలయం 1999–2000 బ్యాచ్ మృతుడి మిత్రులు రూ. 50 వేల నగదును ఆయన భార్యకు గ్రామంలో ఆదివారం అందించారు. పిల్లల చదువులకు అయ్యే ఖర్చులను భరిస్తామని వారు ఆమెకు హామీ ఇచ్చారు.

ప్రజా సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టొద్దు



నిజామాబాద్ సిటీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 13న దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు క్విట్ కార్పొరేట్ పేరుతో నిరసనలు, ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్ తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజా సంపాదనను, సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, నాయకులు రమేశ్ బాబు, నూర్జహాన్, కటారి రాములు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ప్రజలకు అందేలా చూడాలి

ఆర్మూర్: విద్య, వైద్యం ప్రజలకు అందించడం ప్రభుత్వాల బాధ్యత అని టీపీజేపీ నాయకులు డాక్టర్ రవీంద్రనాథ్ సూరి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో ఏఐయూకేఎస్, ఏఐపీకేఎంఎస్, టీయూసీఐ, పీవైఎల్, పీవోడబ్ల్యూ, పీడీఎస్‌యూ తదితర విప్లవ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విద్య, వైద్యం ప్రజలకు అందించడం ప్రభుత్వాల బాధ్యత అన్న అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సురేష్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య, వైద్యాన్ని గ్రామీణులకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐకేయూఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాల కు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లల్లో నిధులు పెంచాల్సింది పోయి తగ్గిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ, బి.దేవారం, ఎం.ముత్తెన్న, వి.గోదావరి, ఎల్.అనిల్ కుమార్, సావెల్ గంగాధర్, కె.రాజేశ్వర్, ఏ.ప్రకాష్, వి.సత్తెవ్వ, బి.బాబన్న, ఆర్.దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	101,600	వెండి(కిలో)	1,21,000
22 క్యారెట్స్	93,795	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	32	60	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	60	పచ్చిమిర్చి	50	90
బీరకాయ	20	40	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	50	100	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	60	గోబిపువ్వు	25	50
వంకాయ	30	60	బీట్‌రూట్	30	60
పాలకూర	20	40	కరివేపాకు	40	80
మెంతికూర	40	80	చామగడ్డ	40	80
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	30	60
పుదీనా	30	60	గోరుచిక్కుడు	40	80
క్యాప్సికం	50	90			

–సుభాష్‌నగర్

కుల సంఘాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ నాగారం: నగరంలోని అన్ని కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సిర్నాపల్లి గడి గాండ్ల పట్టణ సంఘం ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణ గాండ్ల సంఘం రాష్ట్రంలో ఆదర్శంగా నిలుస్తూ ఐక్యమత్యంగా ఎదుగుతోందని అన్నారు. గాండ్ల సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు నాగరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్, రాంభూపాల్, గాండ్ల సంఘం కార్యవర్గం ఉపాధ్యక్షులు ఆసోల్ల రాజేంద్ర, గోపి, సెక్రెటరీ కాసర్ల మోహన్, జాయింట్ సెక్రెటరీ సాయన్న, క్యాషియర్ హనుమాండ్లు, గాండ్ల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాడుదాం



మాట్లాడుతున్న వేల్పూర్ భూమయ్య

మోపాల్ : ఆర్థిక వనరులను దోపిడీ చేస్తూ వ్యవసాయ రంగాన్ని పట్టి పీడిస్తున్న బహుళ జాతి సంస్థలు దేశాన్ని వీడాలని సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 13న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ వేల్పూర్ భూమయ్య తెలిపారు. నిరసనలో రైతులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 20వేల విదేశీ బహుళ జాతి కంపెనీలు కార్పొరేట్ సంస్థల వల్ల చిన్న, సన్నకారు పరిశ్రమలు, స్వదేశీ సంస్థలు పూర్తిగా దెబ్బతిని నష్టపోయాయయన్నారు. వ్యవసాయ రంగాన్ని నమ్ముకుని దేశంలో వంద కోట్లమంది జీవిస్తున్నారని, ఈ రంగం అన్ని విధాలుగా దెబ్బ తిన్నదని తెలిపారు. విదేశీ బహుళ జాతి సంస్థలు దేశం నుంచి వీడే వరకూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఎస్‌కేఎం ఆధ్వర్యంలో పోరాడుదామని పేర్కొన్నారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి అగ్గు చిన్నయ్య, బండమీద నర్సయ్య, రైతు నాయకులు జల్లాపురం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ఈడబ్ల్యూఎస్‌ను అమలు చేయాలి



మాట్లాడుతున్న నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి

నిజామాబాద్‌నాగారం : అన్ని రంగాల్లో ఈడబ్ల్యూఎస్‌ను అమలు చేయాలని ఓసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా అగ్రవర్ణ పేదల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. తమ పరిస్థితి రోజు రోజుకి అన్ని రకాలుగా దిగజారిపోతోందన్నారు. రిజర్వేషన్ లేక తమ నిరుద్యోగ యువత ఇబ్బంది పడుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో కూడా రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. కింది స్థాయిలో కూడా సర్టిఫికెట్ ఇవ్వడంలో చాలా జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బ్రాహ్మణ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొలవి అనిల్ కుమార్, అశోక్, కోవూరి జగన్, ఆర్ యుగంధర్, జోషి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

జక్రాన్‌పల్లి: రైతు బీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి దేవిక సూచించారు. కొత్త పట్టాదారు రైతులకు జూన్ 5 వరకు పట్టా పాస్‌బుక్ వచ్చిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు బీమా చేసుకోని రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు బీమా కోసం దరఖాస్తు ఫారం, రైతు పట్టాదారు పాస్‌బుక్, తహసీల్దార్ డిజిటల్ సంతకంతో కూడిన తహసీల్ ఆఫీస్ కాపీ, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు సమర్పించాలన్నారు. ఆధార్ కార్డులో 18 ఏళ్ల నుంచి 59 వయస్సు ఉన్న రైతులు మాత్రమే బీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 13లోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిచ్‌పల్లి ఏఈవోల వద్ద..

డిచ్‌పల్లి: కొత్త పట్టాపాసుబుక్ వచ్చిన రైతులు, ఇంతవరకు రైతు బీమా దరఖాస్తు చేసుకోని రైతులు ఏఈవోల వద్ద దరఖాస్తు చేసుకోవాలని డిచ్‌పల్లి మండల వ్యవసాయాధికారి సుధా మాధురి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14ఆగస్టు1966 నుంచి 14ఆగస్టు2007 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే ఈ రైతు బీమాకు అర్హులని పేర్కొన్నారు.

దుర్గాదేవి ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

నిజామాబాద్ రూరల్: నగరంలోని గుమాస్తా కాలనీలోని శ్రీ దుర్గాదేవి ఆలయ నూతన కమిటీని సభ్యులు ఆదివారం ఎన్నుకున్నారు. ముందుగా ఆలయంలో ఆలయ కమిటీ ప్రతినిధులు జె. మల్లేశ్ యాదవ్, ఆకుల సందీప్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమందు విజయ్ కృష్ణ, ఉపాధ్యక్షులుగా సంతోష్, అనిల్ కుమార్, కిషన్, ప్రధాన కార్యదర్శిగా బోడికె బాబురావు, కార్యదర్శులుగా రాజేశ్, వెంకటేశ్, కోశాధికారులుగా దాత్రిక వేణుగోపాల్, లవంగ సదాశివ్, గౌరవ సలహాదారులుగా రాజేందర్, భీమన్న, కార్యవర్గ సభ్యులుగా దానాజీ, దుబ్బయ్య, సంతోష్, ఉషన్న, శ్రీనివాస్, రామకృష్ణ, ప్రవీణ్ ఎన్నికయ్యారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు నూతన అధ్యక్షుడికి నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి సభ్యులందరి సహకారంతో కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాలనీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రభుత్వం గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిర్ప లింగయ్య, కళాకారులు

నిజామాబాద్ రూరల్: జిల్లాలోని అన్ని రకాల కళాకారులను ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని నిజామాబాద్ సాంస్కృతిక కళావేదిక నాయకులు సిర్ప లింగయ్య పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో ఆదివారం నిజామాబాద్ సాంస్కృతిక కళావేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో అన్ని రకాల కళాకారుల సహకారం ఎంతో ఉందన్నారు. కళ అన్నది ఒక ప్రత్యేక నైపుణ్యమని అన్నారు. అనేకమంది కళాకారులు ఉపాధి లేక, అనేక సమస్యలతో బాధపడుతున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం వేదిక కృషి చేస్తుందన్నారు. కళాకారులకు కనీస పెన్షన్ రూ. పదివేలు ఇవ్వాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, పేద కళాకారులకు ఇళ్లు నిర్మించాలని, కళాకారుల పిల్లలకు విద్యాసంస్థల్లో ప్రత్యేక అవకాశం కల్పించాలని కోరారు. కళాకారులకు వాయిద్యాలను ఉచితంగా, సబ్సిడీతో ఇవ్వాలన్నారు. సమావేశంలో కళాకారులు దాసు, చరణ్, చంద్రకళ, మధుసూదన్ గౌడ్, రాధా కిషన్, నర్సారెడ్డి, సాయిరెడ్డి, పోశెట్టి, సారారం కృష్ణ, తడకలపల్లి రాజిరెడ్డి, డప్పు గంగారాం, చాంద్ పాషా, మోషన్, శంకర్ గౌడ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మీదుగా హైవోల్టేజీ విద్యుత్ తీగలు



ఇళ్లకు తగిలేలా ఉన్న విద్యుత్ తీగలు



జనవాసాల మధ్య వేలాడుతున్న తీగలు

- ఇబ్బందులు పడుతున్న బైపాస్‌రోడ్ కాలనీ వాసులు
- విద్యుత్ తీగలను తొలగించాలని విజ్ఞప్తి
- పట్టించుకోని అధికారులు

సిరికొండ: మండల కేంద్రంలోని బైపాస్ రోడ్ కాలనీలో జనావాసాల మధ్య ఉన్న హైవోల్టేజీ విద్యుత్ తీగలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ నుంచి కొండూర్ చుట్టు పక్కల గ్రామాలకు విద్యుత్ సరఫరా కోసం 40 ఏళ్ల క్రితం ఈ లైన్‌ను ఏర్పాటు చేశారు. అప్పుడు పొలాల్లో నుంచి విద్యుత్ లైన్ వేశారు. గ్రామానికి ఆనుకొని ఉండటంతో కొన్నేళ్ల నుంచి గ్రామస్తులు ఇళ్లను కట్టుకోవడం ఆరంభించారు. దీంతో ప్రస్తుతం ఆ ప్రాంతంలో కాలనీ ఏర్పడింది. పోలీస్ స్టేషన్ వెనుక నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి వరకు బైపాస్ రోడ్డు వెంబడి హైవోల్టేజీ తీగలు వెళ్తున్నాయి. అప్పట్లో ఇనుప స్తంభాల ద్వారా లైన్‌ను వేశారు. పొలాల్లో కాబట్టి ఎత్తుగానే ఉండేవి. కాలనీ ఏర్పడి సీసీ రోడ్లు నిర్మించి నేలభాగం ఎత్తు పెరగడంతో తీగలు కిందికి తాకేలా మారాయి. ప్రస్తుతం ఆ లైన్ ద్వారా కొండూర్ సబ్ స్టేషన్‌కు విద్యుత్ ప్రసరణ జరుగుతోంది. 33 వేల కిలో వాట్ల విద్యుత్ ప్రసారమవుతుండటంతో తీగల నుంచి మీటర్ దూరంలోనే షాక్ వచ్చే ప్రమాదం నెలకొని ఉంది. ఆ తీగల ప్రదేశంలో తక్కువ ఎత్తులో ఉన్న ఇళ్లను నిర్మించుకున్నారు. ప్రస్తుతం ఆ ఇళ్లు శిథిలావస్థకు చేరగా కొత్త ఇళ్లు నిర్మించుకోవడానికి హై వోల్టేజీ తీగలు అవరోధంగా మారాయి. ఈ కాలనీలో స్థలం ఖరీదు చాలా ఎక్కువగా ఉంది. హైవోల్టేజీ తీగలు ఉండటం వలన వాటి కింద విలువైన స్థలం వృథాగా వదిలేయాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు.

విద్యుత్ ప్రమాదాల ఘటనలు

చాలా కిందికి మారిన హైవోల్టేజీ తీగలతో బైపాస్ రోడ్డు కాలనీలో ప్రమాదాలు జరిగిన ఘటనలు నెలకొన్నాయి. బోయిడి సంఘం కమ్యునిటీ హాల్ పైన ఓ పిల్లవాడు ఆడుకుంటున్న క్రమంలో విద్యుత్ తీగలు తగలడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. చికిత్స కోసం రూ. లక్షలు ఖర్చయ్యాయి. అతడి చికిత్స కోసం తండ్రి తన గొర్రెల మందను అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇలా వివిధ సందర్భాల్లో పలు ఘటనలు నెలకొన్నాయి. ఇళ్ల మధ్యన ఇబ్బందికరంగా మారిన విద్యుత్తు తీగలను తొలగించాలని ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు విన్నవించినా ఎవరూ స్పందించడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందిగా ఉంది



మా కాలనీలో హై వోల్టేజీ తీగలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కాలనీలో చాలా ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. కొత్త ఇళ్లు నిర్మించుకుందామంటే తీగలు అడ్డుగా ఉండటంతో ఇబ్బందిగా మారింది. విద్యుత్ తీగలను తొలగించి ఇబ్బందులను తొలగించాలి. – నారాయణ, కాలనీవాసి

అవస్థలు పడుతున్నాం



మా ఇంటి పక్క నుంచే పెద్ద లైన్ తీగలు వెళ్తున్నాయి. ఇంటి దాబా పైన ఏదైన పని చేస్తున్నప్పుడు తీగలతో చాలా భయంగా ఉంటుంది. వర్షాకాలంలో చాలా అవస్థలు పడుతున్నాం. ఎక్కడ విద్యుత్ షాక్ వస్తుందో అని భయంభయంగా గడుపుతున్నాం. – వినోద, కాలనీవాసి

ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రఘురాం

నిజామాబాద్ అర్బన్: ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల పక్షాన నిలబడిన ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. ఈ నెల 12 నుంచి 30 వరకు గ్రామ స్థాయి జిల్లా స్థాయి వరకు వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, మేధావులు, సంఘం నాయకులందరు వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ కన్వీనర్ సంజయ్, కృష్ణ, నవీన్ కృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ ప్రారంభం

సిరికొండ: మండలంలోని హుస్సేన్‌నగర్‌లో హైమాస్ట్ లైట్‌ను బీజేపీ మండలాధ్యక్షుడు గుర్రాల సంజీవ్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. హైమాస్ట్ లైట్‌కు ఎంపీ ధర్మపురి అర్వింద్ నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు గడ్డ గంగదాస్, బూత్ అధ్యక్షుడు దాసరి రాకేశ్, మహేశ్, గంగదాస్, నాగేశ్, భూమేశ్, చరణ్, అజయ్, సృజన్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

బంజారా సమస్యలను పరిష్కరించాలి



హుస్సేన్‌నాయక్‌తో నాయకులు

సిరికొండ : మండలంలోని గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై జాతీయ అనుసూచిత తెగల కమిషన్(ఎన్‌సీఎస్టీ) సభ్యులు హుస్సేన్‌నాయక్‌తో చర్చించినట్లు ఆలిండియా బంజారా సేవా సంఘం మండల నాయకులు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో అతడిని కలిసి తండాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అనుసూచిత తెగలకు సంబంధించిన హక్కులు, అభివృద్ధి పథకాలు, తండాలకు రోడ్లు, వంతెనలు, విద్యా విషయాలు, వైద్య ఆరోగ్య సేవల్లో నెలకొన్న లోపాలను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమస్యలను సంబంధిత కేంద్ర, రాష్ట్రశాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు బుక్య చందర్, మాజీ సర్పంచ్ సర్య, మండల నాయకుడు రాజేందర్ పాల్గొన్నారు.

ఆదివాసి యువతను ప్రోత్సహించాలి



పెర్కిట్‌లో భీమన్న గుడి వద్ద సమావేశమైన ఆదివాసి నాయక్‌పోడు సంఘం సభ్యులు

పెర్కిట్(ఆర్మూర్): ఆదివాసీ నాయక్‌పోడు కులస్తులందరు తమ కులానికి చెందిన యువతను విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రోత్సహించడానికి ఐక్యంగా ఉండాలని ఆదివాసి నాయక్‌పోడు జిల్లా గౌరవ అధ్యక్షుడు బంగారు భోజన్న, ఉద్యోగుల సేవా సంఘం ముఖ్య సలహాదారుడు జెడ్పీ డిప్యూటీ సీఈవో సాయన్న పిలుపునిచ్చారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ భీమన్న గుడి వద్ద ఆదివారం ఆదివాసీ నాయక్‌పోడు సంఘం సభ్యులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. ఉన్నత విద్య చదివే ఆదివాసి విద్యార్థుల కోసం అంబేడ్కర్ ఓవ ర్సీస్ విద్యా నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చైతన్య పరచాలన్నారు. సమావేశంలో నేతలు గడ్డం శంకర్, కందు రాజేశ్వర్, గాండ్ల రాంచందర్, పుట రాజేశ్వర్, కొసెడుగు రవి, కొంద్రు నవీన్ పాల్గొన్నారు.

బొమ్మలు చేసి.. ప్రాణం పోసి..

- విగ్రహాల తయారీలో రాణిస్తున్న తండ్రీ కొడుకులు
- 40 ఏళ్లుగా ఒకే వృత్తిలో ఉంటూ జీవనం కొనసాగింపు
- తండ్రి బాటలో కుమారుడు సైతం



తండ్రీ కొడుకులు తయారు చేసిన తెలంగాణ తల్లి, కొమురవెల్లి మల్లన్న, ఎడ్లు, ఇతర విగ్రహాలు

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు విగ్రహాల తయారీలో రాణిస్తున్నారు. గ్రామానికి చెందిన నూనె కృష్ణయ్య 40 ఏళ్లుగా విగ్రహాలను తయారు చేస్తున్నాడు. కృష్ణయ్య ఆరోగ్యం సహకరించకపోవడంతో అతని కుమారుడు లీలేష్ సైతం తండ్రి బాటలో పయనిస్తూ విగ్రహాలను గత 15 ఏళ్లుగా తయారు చేస్తున్నాడు. నమ్మిన వృత్తిని వదులుకోలేక తమ వృత్తినే దైవంగా భావించి విగ్రహాల తయారు చేస్తున్నారు. స్టీల్, ఇసుక, సిమెంట్ కలిపి వివిధ రకాల విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఒక్కో విగ్రహం తయారికి నెల నుంచి రెండు నెలల సమయం పడుతుందని వారు తెలిపారు. ప్రస్తుతం విగ్రహాల తయారీకి అయ్యే ముడి సరుకు ఖరీదు ఎక్కువైందన్నారు. ఇదే వృత్తిగా భావిస్తున్నందున నష్టం వచ్చినా వివిధ వర్గాలు, ప్రజల నుంచి మంచి గుర్తింపు లభిస్తోందని అన్నారు. తెలంగాణ తల్లి, రైతు సంఘం ఎడ్లు, చాకలి ఐలమ్మ, కొమరవెల్లి మల్లన్న, తదితర విగ్రహాలను ఎక్కువగా తయారు చేస్తున్నారు. పడకల్ నుంచి కలిగోట్ వెళ్లే రోడ్డును ఆనుకుని వ్యవసాయ క్షేత్రం వద్ద విగ్రహాలను తయారు చేస్తుండడంతో చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఆర్డర్ ఇచ్చి విగ్రహాలను చేయించుకుంటున్నారు. ఎంతో శ్రమతో వివిధ రకాల విగ్రహాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు.



చాకలి ఐలమ్మ విగ్రహాన్ని తయారు చేస్తున్న తండ్రీ కొడుకులు కృష్ణయ్య, లీలేశ్